# సినిమా కథ

ఆ చెవినీ ఈ చెవినీ పడ్డ మోహన్ ప్రణయ గాథ చివరికి శ్రీపతిగారి చెవినిగూడా పడింది. మొదట ఉగ్రుడైపోయారు గాని తరవాత కాస్త తమాయించుకున్నారు. ఆలోచిస్తుంటే, గత కొద్ది కాలంగా మోహన్‌లో వచ్చిన మార్పుకు 'కారణమిదే నన్నమాట' అనుకున్నారు శ్రీపతి గారు.

శ్రీపతిగారి ఒక్కగానొక్క కొడుకు మోహన్. శ్రీపతిగారు లక్షాధికారి కావడం, మోహన్ ఒక్కగానొక్క కొడుకుగా పుట్టడంతో ఎంతో అల్లారుముద్దుగా పెరిగాడు. చిన్నప్పటినుంచి మోహన్ అదోరకంగా వుండేవాడు. కొరతంటూ ఏమీ లేకపోయినా ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవాడికిమల్లే, లేనివాడికిమల్లే దీనంగా వుండేవాడు. 'ఎందుకురా బాబూ అంత దిగులుగా వుంటావు? నీ కేం కావాలో చెప్పు. కొండమీది కోతినైనా తెప్పించి పెడతారు మీ నాన్న' అని తల్లి బ్రతిమాలేది. మరి 'మీరు తెప్పించలేరు' అన్న భావమో ఏమిటో, పాలిపోయినట్లు నవ్వేవాడు మోహన్.

పెరిగి పెద్దవాడవుతున్నకొద్దీ, మరీ పరాయివాడుగా ప్రవర్తించసాగాడు. తన వాళ్లెవరో తనకు గాకుండా పోయినట్లు, తను ఎవరిపంచనో తలదాచుకుంటున్నట్లు, బిక్కుబిక్కుమంటూ లంకంత సొంత కొంపలో ఏ మూలనోజేరి కూచునేవాడు. శిలావిగ్రహానికిమల్లే చలనం లేకుండా కూచుని వుంటే, శ్రీపతిగారి కమతం చేస్తున్న రైతులు "చిన్నదొర దేముడ్రా" అనేవారు. "ఏదో శాపవశాన ఈ భూలోకంలో పుట్టిండుగాని మునీశ్వరుడు" అని మొక్కేవారు.

తన లోకమేమిటో తనేమిటో, మిగతా ప్రాపంచిక విషయాలేమీ పట్టేవి కావు మోహన్‌కి. ఎప్పుడూ పుస్తకాలు, చదువు; లేదా అంటే ఊరిచివరి రామకోవెలకి షికారు. ఒక వైపు కాలేజీలో బియ్యే చదువుతూనే, రెండోవైపు ఉర్దూ పారసీ భాషలను నేర్చుకుంటున్నాడు. గాలిబ్ గజళ్ళన్నా, ఉమర్ ఖయామ్ రుబాయిలన్నా మోహన్‌కి ప్రాణం. అందువల్లనే – వాటి మాతృకలు చదివి ఆనందించాలన్న అభిలాషతో – జైనూల్ ఆబ్‌దీన్ అని ఒక గొప్ప విద్వాంసుడు పరిచయమైతే, ఆయన దగ్గర ఈ రెండు భాషలూ నేర్చుకుంటున్నాడు.

ఎక్కడ సౌందర్యముందో అక్కడికి ఆకర్షించబడతాడు మోహన్. సాదాతనాన్ని సుతరామూ సహించలేడు. అందువల్లనే మామూలు మనుషులతో కలిసి తిరగలేకపోవడం, సాధారణమైన వచన పుస్తకాలు చదవలేకపోవడం. ఒక్కముక్కలో చెప్పాలంటే – ఊహాలోకాలలో విహరింపజేసే అనన్య సౌందర్యం కావాలి తనకు! అందుకే ఈ తపన! తపస్సు!

సీతారాముల కోవెల, ఊరికి దూరంగా, అత్యంత రమణీయమైన ప్రదేశంలో వుంది. ఒక్క శ్రీరామనవమికి తప్పించి, సామాన్యంగా అక్కడ సందడే వుండదు; పట్నవాసపు ప్రజలు అప్పుడప్పుడు "పిక్నిక్" అని వస్తే తప్ప. కాని మోహన్‌కి మాత్రం ప్రతి సాయంత్రం అక్కడికి వెళ్ళందే రోజు పూర్తయినట్లు కాదు.

ఆనాటి సాయంత్రం రామకోవెల దగ్గర మెరుపులాంటి ఒక సంఘటన జరిగింది. మోహన్ ఎప్పటికిమల్లేనే ఒక గండశిల మీద కూచుని తదేకంగా పుస్తకం చదువుకుంటున్నాడు. పుస్తకం లేనప్పుడే ప్రపంచం పట్టదుగదా! మరి చదువుతున్నప్పటి మాట వేరే చెప్పాలా? ఎప్పుడొచ్చారో ఒక అమ్మాయిలగుంపు – ఆడుతూ పాడుతూ అక్కడజేరి దాగుడుమూతలారంభించారు. "పిల్లివచ్చె ఎలుక భద్రం" అంటూ ఒక పిల్ల కళ్ళకు గంతలుకట్టి విడిచారు. ఆ పిల్ల తచ్చాడుతూ తచ్చాడుతూ వచ్చి మోహన్‌ని పట్టుకుంది. పట్టుకోవడంలో చేతికి కళ్ళజోడు తగిలిందేమో – క్రింద బండమీదపడి ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది. గాజు ముక్కల చప్పుడుకు కళ్ళు తెరిచారిద్దరూ!

ఒకరి నొకరు చూసుకున్నారు. ఒకరు స్పష్టంగా చూడగలిగితే, మరొకరు అస్పష్టంగా, అలుక్కుపోయిన కలలో కదిలాడే బొమ్మను చూడగలిగారు.

కళ్ళజోడు లేందే కదలలేడు మోహన్. ఇంటికి పోలేనని చెప్పకపోయినా ఆడపిల్లలామాత్రం గ్రహించి మోహన్‌ని ఇల్లు జేర్చారు.

ఆనాటినుంచి తన కళ్ళజోడు పగలకొట్టిన ఆ పిల్లకోసం ఎదురుచూస్తున్నాడు మోహన్. రెండు రోజులు రాలేదు, మూడు రోజులు రాలేదు; అయిదోరోజు అలాగే ఒంటరిగా వెనకనుంచి వచ్చి కళ్ళుమూయబోయింది. రెండు చేతులూ పట్టుకుని, ముందుకు తిప్పుకున్నాడు మోహన్.

కళ్ళల్లో కళ్ళుంచి చూస్తుంటే, ఒంటి నిండా విద్యుత్తు ప్రవహించినట్లయింది.



కె. చిరంజీవి

మట్టిబొమ్మకు జీవం వచ్చింది! చైతన్యం తొణికిసలాడింది! నవవసంతంతో ప్రకృతి పులకించి, పరవశించి పోయింది.

* * *

"ఇంతకూ ఎవర్రా ఆ పిల్ల?" అని అడిగారు శ్రీపతిగారు.

"ఎవరో బాబూ దిక్కుమాలినపిల్ల! పేరు రాధికంట. ఆ రామాయమ్మగారి హాస్టల్‌లో వుంటూ టీచరమ్మ ట్రెయినింగు చదువుతున్నదంట. దిక్కుమాలిందిగాకపోతే హరిజన హాస్టల్‌లో ఎందుకుంటుంది? బతకలేక బడిపంతులని ఆ టీచరమ్మ ట్రెయినింగెందుకు చదువుతుంది?"

"దాని అంతస్థెక్కడ? మన అంతస్థెక్కడ? ఏమైనా, రామాయమ్మ నడిగి ఆ పిల్లకు సంబంధించిన వివరాలన్నీ కనుక్కురా. ఆ తరవాత ఆలోచిద్దాం" అని ఆర్డరు వేశారు శ్రీపతిగారు.

రాధిక తల్లిదండ్రులు లేని పిల్ల. చిన్నతనానే తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ ఇంట్లో పెరిగింది. మామ తనవాడైతే అత్త తనదవుతుందా? పని మనిషిని చూసినట్లు చూసేది, ఆ అత్త. కాకులకు విదిలించినట్లు ఇన్ని ఎంగిలి మెతుకులు రాధిక మొహాన విదిలించేది. అలా తినో తినకనో, అవమానాలు కుడుస్తూ, మెట్రిక్ వరకు చదువుకుంది. "ఓయబ్బ! ఎంత కష్టపడి అంతవరకు చెప్పించామో – అందుకు సంతోషించు. పై చదువులు చెప్పించటానికి మాకింకా పిల్లాజెల్లా లేరనుకున్నావా?" అన్న వాళ్ళత్త చదువు మాన్పించి, ఎలాగైనా రాధికను వదిలించుకోవాలన్న నెపంతో రెండోపెళ్ళివాడి కివ్వజూపింది. ఆ దెబ్బతో ఇంట్లోంచి బయటపడిన రాధిక అదృష్టవశాత్తు బజారుపాలుగాకుండా రామాయమ్మగారి హాస్టల్‌కొచ్చి పడింది. తొలిచూపులోనే అందరినిట్టే ఆకర్షించగల రాధిక రామాయమ్మగారిని సైతం ఆకట్టుకుంది. ఆవిడ చలవవల్లనే ఇప్పుడీ సెకండరీ ట్రెయినింగు.

రాధిక కథవిన్న శ్రీపతిగారు రామాయమ్మద్వారా హెచ్చరించి చూశాడు గాని ఫలితం అంతగా లేకపోయింది. కొడుకును ఏమీ అనలేడు; కొడుకును చెడగొడుతుందనుకున్న ఆ పిల్లను ఏమీ అనకుండా వుండలేడు. అలాంటి స్థితిలో, రాధికతో ముఖాముఖి మాట్లాడటమే మంచిదని చెప్పి, హాస్టల్‌కి బయలుదేరాడు, ఒకనాడు.

రామాయమ్మగారి ప్రైవేటు గదిలో కూచుని రాధికను రప్పించాడు. రాధిక భయపడుతూ భయపడుతూ లోపలికి రావడం, అంతదాకావున్న రామాయమ్మగారు బయటికిపోవడం ఒక్కసారే జరిగాయి.

"కూచో"

రాధిక కూచోలేదు.

"నేనెవరో నీకు తెలిసేవుంటుందనుకుంటాను."

తెలుసునన్నట్లు తల ఊపింది రాధిక.

"నువ్వూ, మోహన్ ప్రేమించుకున్నారట. విన్నాను. ప్రేమించుకోవడం మానవ సహజం. ఇందులో నేనేమీ తప్పుపట్టడం లేదు" అంటూ తలెత్తి రాధిక వంక చూశారు శ్రీపతిగారు.

వంచిన తల ఎత్తకుండా, కుర్చీ పట్టుకు నిలబడి వింటున్నది రాధిక.

'అయితే ప్రేమించేముందు, వాటి మంచి చెడ్డలను...' మంచి చెడ్డలనంటూ ఆపైన వాక్యమెలా పూర్తిచేయాలో తెలియక ఆగిపోయారు శ్రీపతిగారు.

'మంచి చెడ్డలనూ, లాభనష్టాలనూ బేరీజు వేసుకుని వ్యాపార సరళిలో ప్రేమించాలంటారు!'


రాధిక ఇచ్చిన ఈ 'రిటార్ట్'కు దిమ్మ తిరిగిపోయి నట్లయింది శ్రీపతిగారికి. అయితే వెంటనే తేరుకుని, కొద్దిపాటి చిరునవ్వు మొహాన అతికించుకుని 'ప్రేమ, వ్యాపారమని బుద్ధివున్న వాడెవ్వడూ అనడు. ఒక్కొక్కరి మనస్సు ఒక్కో దానిమీద లగ్నమవుతుంది; నిజమే. ఎందుకు – దాని మీదనే మనస్సు పోతుందంటే – ఏమీ చెప్పలేము. కొందరికి ఎరుపు రంగు ఇష్టమైతే మరి కొందరికి తెలుపు యిష్టం. ఎందుకు నీ కిది ఇష్టమంటే ఏమైనా చెప్పగలమా?' తిరిగి తలెత్తి చూశారు శ్రీపతిగారు.

రాధిక అలాగే తలవంచుకుని నిలబడి వుంది.

'ఏమీ చెప్పలేము. నా కిది ఇష్టమని మాత్రమే చెప్పగలం' అంటూ కాస్త ఊపిరి పీల్చుకుని 'అయితే ఈ ఇష్టాయిష్టాల దగ్గరే వస్తుంది పేచీ. ఇష్టమున్న ప్రతి ఒక్కపనినీ మనం చేయగలమా? నాకు తీపంటే యిష్టం. కాని తింటే నా ఆరోగ్యం చెడిపోతుంది. నాకు ఇష్టంగాబట్టి – రోగాన పడ్డాసరే – చనిపోయినాసరే – తింటాననడం ఆరోగ్యకరమా? వివేకమా? ... మనిషికి కొన్ని నీతినియమాలున్నట్లే, సంఘానికి కొన్ని కట్టుబాట్లున్నాయి. ధర్మవిరుద్ధంగా ఎవరు ప్రవర్తించినాసరే – ప్రవర్తించిన ఆ ఒక్కమనిషికేగాదు – యావత్తు సమాజానికే కీడు మూడుతుంది.'

వింటున్నావా అన్నట్లు తల ఎగరేశారు శ్రీపతిగారు. ఔనన్నట్లు నెమ్మదిగా తల ఆడించింది రాధిక.

'ఉదాహరణకు నన్ను తీసుకో. నాకు పెళ్ళాంబిడ్డ లున్నారు. కావలసినంత ఆస్తి వుంది. ఈ వయస్సులో నా మనస్సు ఏ అమ్మాయిమీదికో పోయిందనుకో. ఆ అమ్మాయిని ప్రేమించానని చెప్పి, ఆ పిల్ల లేకపోతే బ్రతకలేనంటూ తెచ్చి – నా యింట్లో పెట్టుకుంటాననుకో. సంఘం ఏమంటుంది? సంఘం మాట దేవుడెరుగు! నా సంసారం ఏమవుతుంది? నా భార్య కుమిలికుమిలి ఏడుస్తుంటే నాకు సుఖమా? నా కన్నకొడుకే నన్ను గౌరవిస్తాడా? తండ్రి ఒక తప్పుచేస్తే కొడుకు పదితప్పులు చేయడా?' అంటూ మళ్ళీ ఊపిరి పోసుకుని 'ఈ నీచపుపని ఆ పిల్లకు మాత్రం సుఖాన్నిస్తుందంటావా? తాత్కాలికంగా కొన్నాళ్ళు సుఖపడితే సుఖపడవచ్చుగాని, ఎల్లకాలం సుఖపడ లేదుగదా? నేను హరీ అన్న మరునాడే వీధిని పడక



తప్పదు. ఇంకా ఈ దుష్ట సంబంధానికి పిల్లా జెల్లాగూడా తోడైతే వేరే చెప్పాలా ?... చూడు, ఒక్క పనికి ఎన్ని ఫలితాలుంటాయో!' అంటూ అల్లుకుపోతున్న శ్రీపతిగారిని ఆపింది రాధిక.

'ఇంతకూ మాది దుష్ట సంబంధమని మీ అభిప్రాయమా ?'

'అబ్బెబ్బే కాదు. నన్నలా అపార్థం చేసుకోవద్దు. ఒక పనికి—అది మంచిపనిగానీ చెడ్డపనిగానీ – ఇన్ని ఫలితాలుంటా యంటున్నాను. మంచిపనికి మంచి ఫలితాలు; చెడ్డ పనికి చెడ్డ ఫలితాలు. ఒక్క గింజే కదా చెట్టయి నూరు గింజల్నిస్తుంది! మనం ఏపని చేయ తలపెట్టినా వెనక ముందు లాలోచించా లంటున్నాను. పరిణామాలను పరిశీలించా లంటున్నాను.'

'పరిణామాలను పరిశీలించేనా రామాయమ్మ గారితో బెదిరింపు నోటీ సిప్పించారు ?'

ఇక 'ఇదికొరకరానికొయ్యే' ననుకున్నారు శ్రీపతిగారు. ఈ కొరకరాని కొయ్యలన్నీ మర్యాద మంటలకు వింటాయి. అందువల్ల గొంతు తగ్గించి, వీలైనంత ఉచిత మర్యాద ఉట్టిపడేలా 'చూడమ్మా ! వాడికి మేనరికం వుంది. సుశీల పుట్టగానే వాళ్ళమ్మ – అంటే స్వయానా నా చెల్లెలు—ఆ పసిగుడ్డును నాచేతి కందించి, నాయింటి కోడల్ని చేసుకోమని కన్నుమూసింది. ఆనాటినుంచి ఈనాటివరకు ఆ పిల్ల మా యింట్లోనే, ఇంటి కోడలికి మల్లేనే పెరుగుతున్నది. ఇప్పుడీ విషయం తెలిస్తే—ఈ ఆఘాతం తగిలితే – పాపం తల్లి దండ్రులులేని అ పిల్ల ఏమవుతుందో చెప్ప లేను. వాడి మీదనే ఆశలుపెట్టుకు జీవిస్తున్న ఆ పిల్ల కళ్ళముందు బొమ్మ చెరిగిపోయిం దంటే...ఏమో...బ్రతుకుతుందని నే ననుకోను.' ఎంతో డ్రెమెటిక్‌గా అంటూ లేచారు శ్రీపతిగారు.

అంత డ్రెమెటిక్‌గానే, ఆ మరునాడు సుశీల రాధికను చూడ్డానికొచ్చింది. రామాయమ్మగారి అనుమతితో రాధికను వెంట బెట్టుకుని తమ ఇంటికి తీసుకెళ్ళింది.

ఇల్లంతా చూపెట్టాక, రాధికను తన గదిలో కూచోబెట్టి ఇక మాటలెలా ప్రారంభించాలో తెలియక తికమక పడుతున్నది సుశీల.

సుశీలను చూసిన వారెవరికైనా, వెంటనే ఆమెపట్ల సదభిప్రాయం కుదిరిపోతుంది. పూజ్యభావం సైతం ఏర్పడుతుంది. అలాంటి ముఖకవళికలు ఆమెవి. ఎంతో మర్యాదగా, మన్ననగా ఉంటుంది మాటతీరు. చిన్నతనానే తల్లిదండ్రులు పోవడం వల్లనేమో కళ్ళల్లో దైన్యం గూడు కట్టుకుని వుంటుంది.

ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియని సుశీల దీనావస్థ చూసి రాధికే మాటలు ప్రారంభించింది.

'చెప్పండి. నన్నేం చేయమంటారు?'

'అంటే ?' దేన్నిగూర్చి రాధిక అంటున్నదోగూడా తెలియలేదు సుశీలకి.

రాధిక సన్నగా నవ్వుతూ 'అదే, మోహన్ విషయంలో నన్నేం చేయమంటారని ?' అంది.

'మీ యిష్టం.'

ఈ మాటతో మరీ నవ్వొచ్చింది రాధికకు. పెద్దగానవ్వుతూ 'నా యిష్టమంటే మోహన్ని మీకు వదిలిపెట్టను. సరేనా ?' అంది.

'అదే మీ యిష్టమైతే నేను చేయగలిగిందేముంది ?'

'ఏమీ లేదా?'

'ఏమీ లేదు' అని కుండ బద్దలుకొట్టినట్లుగా చెప్పేసింది సుశీల.

సుశీలకంట్లో పూసిన కన్నీటిపువ్వు రాధిక గుండెల్ని చీల్చింది. కరకుతనాన్ని కరిగించివేసింది.

'అయితే మీ మోహన్ని మీకు-కాదు నా మోహన్ని మీకు - సమర్పిస్తున్నాను. మీ యిష్టంముందు నా యిష్టం తలవంచింది. ఇక మోహన్ మీవాడే. మీరే స్వీకరించండి' అంటూ సుడిగాలిలా మేడమెట్లు దిగి బయటి కొచ్చేసింది రాధిక. ఈ క్షణంలో చుట్టూవున్న ప్రపంచం, మామూలు మర్యాదలు, సెలవు పుచ్చుకోవడాలు - ఇవేమీ పట్టలేదు రాధికకు.

* * *

ప్రపంచం చిత్రమైంది. మనుషులంతా ఒక్కటే అయినా ఎవరి ప్రపంచం వారిదే. ఒకప్రక్క చావు మేళం; మరోప్రక్క పెళ్లి మేళం.

సుశీల కన్నీటిచుక్కతో గాయపడిన రాధిక గుండె రక్తాన్ని ఓడ్చుతున్నది. క్రమంగా రక్తంపోయి శరీరం క్షీణించినట్లయింది. సుశీల మంచితనాని కొక్కదానికి మాత్రమే రాధిక లొంగిపోలేదు. 'తనలాగే సుశీల తల్లిదండ్రులులేని అనాథ' అనుకున్నప్పుడు రాధిక హృదయం ద్రవించిపోయింది. అప్పుడే అనుకుంది - సుశీల కెలాంటి అన్యాయమూ తలపెట్టగూడదని. ఆ నిశ్చయంతోనే సుశీలతో బయలుదేరి, ఆమె మాటలతో ఆ నిశ్చయాన్ని బలపరుచుకుని, తన్ను ప్రాణంగా ప్రేమించే మోహన్ని త్యజించి, గాయపడిన గుండెతో విసురు గాలికిమల్లే వచ్చేసింది. తిరిగి హాస్టల్‌గుమ్మం తొక్కడానికి మనస్సు తిరస్కరించింది. హాస్టల్‌లో వుంటే - హాస్టల్‌లోనే కాదు ఈ ఊళ్లో ఎక్కడున్నా - మళ్లీ ఏవో గొడవలు రావచ్చు. మోహన్ తిరిగి ప్రత్యక్షమై 'నిన్ను తప్ప మరెవ్వరినీ వివాహమాడ'నని ఉరి పెట్టవచ్చు. అందువల్ల ఈ ఊరొదిలిపెట్టి వెళ్ళిపోవడమొక్కటే శ్రేయస్కరం అనుకుంది రాధిక. కాని ఎక్కడి కెడుతుంది? ఎవరున్నారు తనకీ ప్రపంచంలో ? ఎక్కడికి వెళ్ళినా ఆడదాని ఒంటరిబ్రతుకు ప్రమాదమే గదా ? అటుతిరిగీ ఇటుతిరిగీ, చివరికి శోష కొచ్చి, హాస్టల్ గుమ్మమెక్కక తప్పలేదు రాధికకు. కాని హాస్టల్‌లో ప్రస్తుత పరిస్థితి భిన్నంగావుంది. తనకిక అక్కడ స్థానం లేదట! తన ప్రవేశానికే అనుమతించారు కారు! గేటులో నిలబెట్టే తన పక్కబట్టలూ, చీరపాతలూ వీధిలోకి విసిరేశారు!

'మేమేం చేయలేమమ్మా! ఇది రామాయమ్మగారి 'ఆజ్ఞ' అన్నాడు ముసలి వాచ్‌మన్.

మిటమిటలాడుతున్న ఎండలో, ఎటు పోతున్నదో తనకే తెలియకుండా నడిచిపోతున్నది రాధిక. ఆయాసమెక్కువవుతున్న కొద్దీ బలంగా, వేగంగా అడుగులు వేస్తున్నది. ఆరిపోబోతున్న దీపం ఒక్కసారిగా గప్పున వెలిగినట్లు రైలుకట్ట పట్టుకుని పరుగెత్తుతున్నది రాధిక. అటునుంచి వేగంగా పరుగెత్తుకొస్తున్న రైలు...ఇటునుంచి అంత వేగంగానూ రాధిక.

* * *

దక్షిణ ఎక్స్‌ప్రెస్ ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంటులో రాధిక మద్రాసునగరానికి రవాణా అయిపోతున్నది.

తంతే బూరెలబుట్టలో పడ్డట్లు లేదా ఏది చేసినా భగవంతుడు అన్నీ మన మేలుకే చేస్తాడన్నట్లు-ఆనాడు రైలుక్రిందపడి ఆత్మహత్య చేసుకోప్రయత్నించిన రాధికను ఒక సినిమా కంపెనీవాళ్లు రక్షించారు. అదృష్టవశాత్తూ వారిలాంటి దృశ్యమే ఒకదాన్ని 'షూట్' చేయడానికి అక్కడ చేరబట్టి సరిపోయిందిగాని లేకపోతే రాధిక ఈపాటి కేమయ్యేదో ?

డైరెక్టర్ సుందరం ఆ పిల్లను చూసీ చూడ్డంతోనే 'ఓకే' అనుకున్నాడు మనస్సులో. ప్రస్తుత హీరోయిన్, సమయానికి కాల్‌షీటివ్వక, ఇచ్చినా సకాలానికి రాక, కావలసినంత ట్రబుల్ క్రియేట్ చేస్తున్నది. వాస్తవానికి ఈవేళ రైలుకింద పడ్డానికి గూడా తను రావలసింది గాని, డమ్మీతో లాంగ్ షాట్‌లో పని ముగించుకోమని ఒక చీటీ పంపింది. మింగలేక, కక్కలేకపోయిన ప్రొడ్యూసర్‌గారు, ఆ చీటీని ముక్కలు ముక్కలు క్రింద చించేసి 'పదండి పోదాం. ఇంతోటి సీనుకు ముండమోపి డమ్మీగూడా ఎందుకు ? సర్కారువారి రైలుతోటే షూట్ చేసుకొద్దాం' అని బయలుదేరదీశారు తన కంపెనీని.

అలాంటి అదృష్టఘడియల్లో సినిమా కంపెనీతో పరిచయమేర్పడింది రాధికకు.

'ఏమమ్మాయ్! సినేమాలో వేషం కడతావా?' అని అడిగారు ప్రొడ్యూసర్‌గారు రాధిక అందానికి ఉబ్బిపోతూ; పైకి కనిపించనివ్వకుండా.

'మీ దయ. ఏంచేయమంటే అది చేస్తాను.'

అంతా ఒకరిమొహా లొకరు చూసుకుని, చక్కగా రిహార్సల్ చేసి తర్ఫీదయినట్లు కలిసికట్టుగా పడిపడినవ్వారు. అంతే! ఆ కంపెనీ రాధికముందు కుదేళ్ళు!

ఇక్కడ రాధిక - రాధిక కాదిప్పుడు మేనకగా పేరుమార్చారు డైరెక్టర్ సుందరం గారు-సినిమా కాంట్రాక్టుమీద హర్షధ్వానాల మధ్య సంతకం పెడుతుంటే ... అక్కడ మోహన్ బాజాభజంత్రీలమధ్య సుశీల మెడలో తాళికడుతున్నాడు.

ఇలా తండ్రి చెప్పిన ప్రతిమాటకూ మోహన్ బసవన్నలా తల ఊపడానికి కారణముంది. వంచితుడైన ప్రేమికుడు తను: పగిలిపోయిన హృదయం తనది: తన్ను ప్రేమించిన, తను ప్రేమించిన యువతి పరాయివాడితో లేచిపోయింది!

(హాస్టల్ కెదురుగావున్న కుట్టుమిషన్ సాయిబుతో రాధిక లేచిపోయినట్లు రామాయమ్మగారితో జయప్రదంగా చెప్పించారు శ్రీపతిగారు)

ఇక తాను ఏమైపోతేనేం ? ఎలా అయితేనేం ? అన్న భావంతో వెనకటి మనిషైపోయాడు మోహన్. వెనకటి మనిషేమిటి, ఇంకా వెనక్కి వెనక్కి పోతున్నాడు.

ఎప్పుడూ ముభావంగా వుంటాడు. ఎవరితోనూ సరదాగా రెండుమాటలు మాట్లాడడు. ఇంతకుముందు పుస్తకాలైనా ముందేసుకుని చదువుతుండేవాడు; ఇప్పుడదీలేదు. అంతా శూన్యం! శూన్యమే తనకి మిగిలినట్లు అలా

నిర్వికారంగా చూస్తుంటాడు. స్నానానికి నీళ్ల పెట్టారంటే స్నానంచేస్తాడు; లేకపోతే లేదు. 'భోజనానికి లే నాయనా' అంటే భోజనంచేసి వస్తాడు. అంతేగాని తనకు తానై ఏదీ అడగడు. తనకు కావలసింది ఏముంది? అంతా రాధికతోనే పోయింది!

పెళ్ళితో పిచ్చి కుదురుతుందనుకుంటే ఇంకా ముదురుతున్నది. ఏంచేయాలో తోచని శ్రీపతిగారు, బోరెడంత డబ్బు తగలేసి, మహామహా నగరాలన్నీ తిప్పి చూపించారు. చూడ్డమైతే చూస్తున్నాడుగాని ఆ కళ్ళల్లో జ్యోతులుంటేగా? దేశంలోని కళాఖండాల నన్నిటినీ గుడ్డివాడికిమల్లే తడివిచూశాడు!

ప్రాణంలేని కట్టెతో కాపురంచేస్తున్న ఉత్తమురాలు, పాపం గుడ్లనీరు కుక్కుకోవడంతప్ప మరేమీ చేయలేకపోయింది. అదయినా—ఎన్నడూ భర్తసమక్షానయినా— కంట తడిపెట్టని ఉత్తమయిల్లాలు. గరళాన్ని ప్రేమలో పొదివి దేవుడి పేరుమీద మింగుతున్నది సుశీల!

కష్టాలొస్తే అన్నీ కలిసికట్టుగా, కట్టగట్టుకుని వస్తాయంటారు. ఆరోగ్యం చెడిపోయిన శ్రీపతిగారు మంచమెక్కి కొన్నాళ్ల తీసుకుని మరణించారు. ఆయన మరణించిన రాత్రే సుశీలమ్మ మగబిడ్డను ప్రసవించింది. కాన్పు కష్టమైపోయిందట. బ్రతికి బయట పడ్డ శిశువు ఏడవనుగూడా ఏడవలేదట.

శ్రీపతిగారి మరణంతో, పాపం వారి సంసారం కుక్కలు చించిన విస్తరిలా తయారయింది. ఎక్కడలేని అప్పుల వాళ్ళంతా వచ్చి, ఎవరి కందింది వారు పట్టుకుపోవడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో ఇంటికి దిక్కయిన సుశీలమ్మే కాస్త కలుగజేసుకుని, పరువుపోకుండా పొలమమ్మి కట్టవలసిన వాళ్ళకు కట్టింది.

ఇక పట్నంలో వుండే తాహతు తమకు లేదు. అయినా ఇక్కడెందుకుండాలి? ఇంకా ఇక్కడ ఏం మిగిలిందని? ఇక్కడుంటే తన భర్త రామకోవెల చుట్టూ — గతస్మృతులను నెమరు వేసుకుంటూ — తిరుగుతూనే వుంటాడు. కాబట్టి ఎంత త్వరగా మకాం మార్చితే అంత మంచిదన్న నిర్ణయానికొచ్చింది సుశీలమ్మ.

'ఏమండీ! మన ఊరికి మనం వెళ్ళిపోకూడదూ?' అని నెమ్మదిగా కదిలించింది భర్తను.

'నీ యిష్టం సుశీలా! నీ మాటకు ఎప్పుడైనా ఎదురు చెప్పానా నేను?' అన్నాడు మోహన్ పసిపిల్లవాడిలాగా.

భర్తనూ, చంటివాణ్ణీ తీసుకుని పల్లెకు ప్రయాణమైంది సుశీలమ్మ. అప్పులవాళ్లకు పోయిందిపోగా—ఇక మిగిలింది ఎకరమున్నర పొలం; ఎప్పటిదో తాతలనాటి దొర పాత యిల్లు.

* * *

వీళ్ళు వదిలిపోతున్న పాతయింటికి మకాం మార్చుతుంటే, ఇక అక్కడ మేనక కోడంబాకంలో కొత్త యిల్లు కట్టించుకుని గృహప్రవేశం చేస్తున్నది.

మేనక ఇప్పుడు పెద్దతారల్లో లెక్క. రెండు చేతులతో సంపాదించడమంటారే—అలా రెండు చేతులతోనేగాక కాళ్ళతోనూ, కళ్ళతోనూ, ముక్కుతోనూ, మొహంతోనుగూడా సంపాదిస్తున్నది మేనక. వచ్చే అయిదేండ్ల వరకు ఎవ్వరికీ ఇహ ఒక్క కాల్‌షీటిచ్చే తీరికలేకుండా బుక్కయి కూచున్నది. అంత బిజీ ఆర్టిస్టిప్పుడు!

ఏదో కంపెనీ వాళ్ల ఔట్‌డోర్ షూటింగ్ కేర్పాటు చేసుకున్నారు. ఆ ఏర్పాట్ల ప్రకారం తాను రేపు పొద్దుట లేచి ఆ ఊరు వెళ్ళి రావాలి. ఎప్పుడు ఔట్‌డోర్ అన్నా, తనకు ఆ రామకోవెల దృశ్యాలే కళ్ళముందాడతాయి. కాని ఎవరూ, ఎప్పుడూ అక్కడికి తీసుకు వెళ్ళరేం?

ఈసారెందుకో అక్కడికే వెడుతున్నట్లు ఊహిస్తున్నది మేనక. మేనక ఇలా ఊహిస్తుంటే, ఆ రాత్రి తన్ను వెదుక్కుంటూ రాధిక తన ఊరు వచ్చినట్లు కలగన్నాడు మోహన్. వచ్చి నిద్ర మంచం మీదినుంచి తన్ను లేపుతున్నదట!

'రాధికా! వచ్చావా రాధికా' అంటూ గబగబా లేచి చేతులుసాచి 'ఎక్కడ? నువ్వెక్కడ? కనిపించవేం రాధికా' అని పట్టుకోబోవడంతో కళ్ళజోడు క్రిందపడి ముక్కలైపోయింది. కళ్ళజోడు లేందే కదలలేడుగదా! కల కరిగి శిలయైపోయాడు మోహన్!

మేనక ఊహించినట్లు ఆ వూరుగాక పోయినా ఇప్పుడు మోహన్ స్వగ్రామానికే వచ్చింది. అయితే ఈ విషయం ఆమెకీ తెలియదు; తన కల నిజమైనట్లు మోహన్‌కీ తెలియదు.

షూట్ చేయబోతున్న ఆ సన్నివేశానికి పదిమంది పిల్లలుకావాలి. డైరెక్టర్ సుందరం గారు ముందే చేసిన ఏర్పాట్ల కనుగుణంగా పిల్లలంతా సిద్ధంగా వున్నారు. అందులో ఒకపిల్లవాడితో పెద్దతగాదా. వాడు ఏమైనా సరే వస్తానంటాడు; మిగతా వాళ్ళు వచ్చినా సరే రానివ్వమంటారు.

ఆ పిల్లవాణ్ణి చూడగానే మేనకకు పూర్వస్మృతులేవో గుర్తు కొస్తున్నాయి.

'ఇంతకూ ఏమంటాడా అబ్బాయి?' అంది మేనక డైరెక్టరు గారితో.

'ఏమంటాడో నువ్వే కనుక్కో' అంటూ గుంపులోంచి ఆ అల్లరి పిల్లవాణ్ణి ముందుకు లాగాడు డైరెక్టర్ సుందరంగారు.

'ఏం బాబూ! ఇలా అల్లరి చేయడం తప్పుగదూ?' అంది మేనక.

ఆ పిల్లవాడు మాట్లాడలేదు.

'మాట్లాడవేం? చెప్పు.'

'మెమ్మెమ్మె మేమ్మె' అంటూ ఏమో చెప్పుకుపోతున్నాడు ఆ మూగ పిల్లవాడు. అంతవరకూ మేనక కా పిల్లవాడు మూగ అని తెలియదు. మూగవాడు గనకనే పిల్లలంతా అతన్ని వద్దంటున్నారట.

ఆ పిల్లవాణ్ణి అక్కున జేర్చుకున్న మేనక ఎవరీ పిల్లవాడని అడిగింది.

'మోహనరావు కొడుకు.'

'ఏ మోహనరావు?'

'సుశీలమ్మగారి మోహనరావు.'

ఓరి భగవంతుడా! తన మోహన్ కాదు గదా! అవునోకాదో స్థిరపరుచుకుందామని, వెంటనే వాళ్ళ ఇంటికి బయలుదేరింది.

ఇంట్లో అడుగుపెడుతుండగా కనబడ్డ దృశ్యమిది: సుశీలమ్మ తన భర్తను గుడ్డివాణ్ణి నడిపించుకొచ్చినట్లుగా లోపలిగది లోంచి నెమ్మదిగా బయటికి నడిపించుకొస్తున్నది.

తన కొడుకుతోవున్న గొప్ప అందగత్తెను-సినిమా స్టారును-అలాగే బిత్తరపోయినట్లు తేరిపారజూస్తున్నది సుశీలమ్మ. ఎవరీమె? తమ యింటికొస్తున్నదేమిటి? అరే! ఎక్కడో చూసినట్లుందే ఈమెను?

కాస్త దగ్గరకురాగానే ఆమె ఎవరో సుశీలమ్మకు అర్థమైపోయింది. అత్యంత సంతోషంతో 'ఏమండీ! ఎవరొచ్చారో చూశారా? ఇటు, ఇటుచూడండి' అన్నది సుశీలమ్మ తన భర్తతో. అన్నదోలేదో వెంటనే తన భర్త చూడలేనితనం గుర్తుకొచ్చి, కడిపెడు దుఃఖాన్ని కళ్ళల్లో దాచుకుంటూ, నోటికి పైటచెంగు అడ్డు పెట్టుకున్నది. భర్తముందు ఎన్నడూ కంటతడి పెట్టగూడదని సుశీలమ్మ శపథం!

వెల్లువలా వచ్చిన అంత దుఃఖాన్ని దిగమింగుకుంటూ 'కూచోమ్మా కూచో... ఏమండీ! ఎవరొచ్చారో ఇప్పటికైనా పోల్చుకో గలిగారా? మీరాధిక ... రాధి కొచ్చిందండీ' అన్నది సుశీలమ్మ.

ఎక్కణ్ణుంచి వచ్చిందో అంత చైతన్యం రాధికపేరు వినడంతోనే మోహన్ శరీరం జలపాతమై దూకింది. 'నా రాధిక వచ్చిందా? ఏదీ? నన్ను తాకనివ్వదేం?' అంటూ మేనక చేయి తన చేతుల్లోకి తీసుకుని 'అవును. నాకు తెలుసు రాధీ! నన్ను వెతుక్కుంటూ నువ్వు వస్తావని నాకుతెలుసు. నువ్వీరోజే వస్తున్నట్లు నాకు రాత్రి కలగూడా వచ్చింది' అంటూ ఏమేమో చెప్పుకుపోతున్నాడు మోహన్.

పిల్లవాణ్ణి తీసుకుని లోపలిగదిలోకెళ్ళిపోయింది సుశీలమ్మ.

గదిలో ఇద్దరే ఇద్దరున్నారు. ఇంత కాలంగా మాటలకు మొహంవాచిపోయినట్లు, అదేపనిగా మాట్లాడుతున్నాడు మోహన్. మేనక పల్లెత్తి ఒక్కమాటగూడా మాట్లాడలేదు.

'ఏం రాధీ! మాట్లాడవేం'?

మాట్లాడే స్థితిలోలేదు మేనక. పెదవి విప్పితే దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించేలా వుంది.

'చూశావుగా మా స్థితి! కళ్ళజోడు పగలగొట్టుకుని మళ్లీ కొనుక్కోలేని దుస్థితిలో గుడ్డివాడిలాగా తిరుగుతున్నాను నేను. ఈ గుడ్డివాడికి మూగవాడు కలిగాడు. ఈ అవిటి వాళ్ళద్దరితోనూ ఆ యిల్లాలు సుశీలమ్మ...'

'ఆపండి. నే వినలేను.'

'ఇదంతా నీవల్ల...నీవల్లజరిగింది రాధీ! నువ్వు పోయావు; మాకీ తిప్పలొచ్చాయి. నువ్వే వుంటే నేను మూగవాణ్ణయ్యేవాడినా? నాకు మూగపిల్లవాడు కలిగేవాడా? మూగ మొద్దులాగా భార్యతో కాపురంచేస్తే మూగవాడు పుట్టక...'

వెక్కి వెక్కి ఏడుస్తున్నది మేనక.

'ఎందుకేడుస్తావు? చెప్పు. మా పతనానికి కారణం నువ్వు కాదంటావా?'

'నేనే. నేనే. నేనే' నంటూ సుళ్ళు తిరుగుతూ అతని పాదాలమీద వాలిపోయింది మేనక.

*　　*　　*

షూటింగ్ ముగించుకుని వెళ్ళబోతూ మళ్లీ ఒకసారి మోహన్ వాళ్ళ యింటికెళ్ళింది మేనక. ఆర్థికంగా వాళ్ళ కేమైనా సాయం చేయగలనని చెప్పే ధైర్యం లేకపోయింది. ఎన్ని గుండెలు కావాలి ఆ మాట చెప్పడానికి? వాళ్లెక్కడ? తానెక్కడ? ఎంత చితికిపోయినా వాళ్ళు ఉన్నతులు! సాయం చేయడమంటే వారిని చిన్నచూపు చూసినట్లే అవుతుంది! అయితే...ఎలా... ఎలా వాళ్ళ నీ స్థితిలో చూస్తూ ఊరుకోవడం?

'అక్కా! మీ దేవుణ్ణొకసారి పట్నం పంపించకూడదూ? పిల్లవాణ్ణిగూడా కలిపి పంపిస్తే, పెద్ద డాక్టర్లకు చూపెట్టి, మన అదృష్ట మెలా వుందో ఓసారి పరీక్షించుకుందాం.'

చాలా జాగ్రత్తయిన భాషలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది మేనక. మోహన్ని తీసుకుపోతాననడమే పెద్దతప్పు. తీసుకుపోయి కళ్ళజోడు 'కొనిపెట్టి' పంపించేస్తాననడం మరీ తప్పు. అందుకే తోడుగా పిల్లవాణ్ణిగూడా కలిపింది.

'అక్కా' అని పిలిచే ధైర్యం ఈనాడు వచ్చిందిగాని ఆనాడు లేదు మేనకకు!

'చూడమ్మా! ఈ దేవుడు నువ్వు ప్రసాదించిన దేవుడే. నువ్వు నాపై జాలి దలచి, కరుణించకపోతే, నా కసలు దేవుడంటూ వుండేవాడా?'

సుశీలమ్మ మాటలకు కదిలిపోయింది మేనక. ఏం మాట్లాడాలో తెలియలేదు. 'అది కాదక్కా! నన్నింక పరాయిదాన్నిగా భావించకు. నీ తోడబుట్టినదాన్నే అనుకో. తోడబుట్టినదానికి నే నన్యాయం జేస్తానా? నీ దేవుణ్ణి నీ నుంచి వేరుచేసి నేను బ్రతగ్గలనా?' అంటూ తల్లి ఒడిలోవున్న మూగ పిల్లవాడి చేతిలో ఏదో ఒక పొట్లాం పెట్టి ఒక్క క్షణమైనా ఇక అక్కడ నిలవకుండా వచ్చేసింది మేనక.

తినేవేమైనా ఉన్నాయేమోనని విప్పి చూశాడు కుర్రాడు. బిస్కెట్లూ,చాకొలెట్లతో పాటు ఒక కాగితం కనిపించింది. అమ్మకిచ్చాడు. చూస్తే, సంతకంచేసి యిచ్చిన బ్లాంక్ చెక్కు!

*　　*　　*

ఆ చెక్కును రైలు ఛార్జీల కవసరమయ్యే పాతికరూపాయలుగా మార్చుకుని, ఒక మనిషిని సాయం తీసుకుని, మద్రాసు రైలెక్కాడు మోహన్. అంత మహా నగరంలోనూ మేనక ఇల్లు కనుక్కోవడం పెద్ద కష్టమనిపించలేదు. కాని ఇంటిదగ్గరే కాస్త గొడవజరిగింది. కాపలావాడు లోపలికి

పోనివ్వనంటే, కోపమొచ్చి వాడిమీద కేక లేశాడు మోహన్. వీళ్ళ పల్లెటూరి అవతారాలను చూసి, మెడపట్టి బయటికి గెంటాడు వాడు. అలాంటి రసాభాస సన్నివేశంలో, పెద్ద పడవలాంటి కారులో వచ్చి దిగింది మేనక.

ఏదో రాకుమారి వేషంలో వుంది. దిగీ దిగటంతోనే ఆ కాపలావాడి లెంపలు వాయించి, అక్కడికక్కడే నౌకరీనుంచి ఊడబెరికి, పంపించివేసింది.

జరిగిందానికి క్షమాపణ వేడుకుంటూ అత్యంతాదరంతో లోపలికి తీసుకువెళ్ళింది. ఇంట్లో మేనక అత్తమామ లున్నారు. ఒకటి గాదెకింద పందికొక్కయితే, మరొకటి చాపకింద నీరు. ఈ రెండూ తల లెళ్ళబెట్టి విస్తుబోయి చూశాయి.

వాళ్ళ తన అత్తమామలని మోహన్‌కి పరిచయం చేసిందిగాని, మోహన్ ఎవరో వాళ్ళకి పరిచయం చేయలేదు. గాదెకింది పందికొక్కు అడగనే అడిగింది. ఈ ధృతరాష్ట్ర మహాప్రభు దెవ్వడని.

'నా దేవుడు' అంది మేనక ఇంకేమీ అనలేక.

ఒకరిమొహాలొకరు చూసుకున్న కొక్కూ, నీరున్నూ తలవంచి 'గుడి దేవుడికి నమస్కారం' అంటూ మొక్కాయి.

'చెబుతున్నాను. నా దేవుడి కే అపచారం జరిగినా సహించను ... తాయారూ! తాయారూ!' అంటూ మోహన్ని నెమ్మదిగా నడిపించుకుంటూ లోపలికి తీసుకువెళ్ళింది మేనక.

* * *

మోహన్ పట్నంవచ్చి పదిరోజులయింది. పదిహేనురోజు లయింది. నెల అయింది. తోడుగాతెచ్చిన పరంధామయ్యను అప్పుడే పంపేసి, తాను పట్నంలోనే కూచున్నాడు. వచ్చిననాటి సాయంత్రమే మేనక తన్నొక పెద్ద డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి, పరీక్ష చేయించి, కళ్ళజోడిప్పించటంవల్ల, ప్రపంచాన్ని ఖుషీగా చూడగలుగుతున్నాడు.



మోహన్ని వెళ్ళమని చెప్పనూలేదు; ఉండమని కోరనూలేదు. పాపం అలాంటి స్థితి మేనకది. అప్పటికీ మోహన్‌కి తెలియకుండా – ఇదుగో రెండురోజుల్లో దేవుడు బయలుదేరి వచ్చేస్తున్నాడని చెప్పి – సుశీలమ్మకు ఉత్తరం రాసింది. రాసిగూడా ఇప్పటికి పన్నెండు రోజులు!

మరి మోహన్ ఏమనుకుంటున్నాడో ఏమో ఆ వూసే ఎత్తడు. ఊరి ధ్యాసేలేదు అతనికి. ఊళ్ళో తనకో భార్యా, కొడుకూ ఉన్న స్ఫురణే లేనట్లు కనిపిస్తున్నాడు.

డ్రాయింగ్‌రూమ్‌లో వున్న సోఫాసెట్లు స్టడీరూమ్‌లోకి మార్పించటం, స్టడీరూమ్‌లో వున్న బీరువా ఖాళీచేయించి విజిటర్స్ రూమ్‌లో పెట్టించటం, ఆ బొమ్మ ఇక్కడా, ఈ బొమ్మ అక్కడా, గాజు కిటికీలు తుడిపించటం, లాన్‌లో గడ్డి కోయించటం– ఇలాంటి పనులలో పూర్తిగా మునిగిపోయి వున్నాడు.

మోహన్ని తన భార్యాబిడ్డలదగ్గరకు పంపించడ మెలాగన్నదే పెద్దసమస్య అయిపోయింది మేనకకు. సుశీలమ్మ దగ్గర్నుంచి ఉత్తరాలమీద ఉత్తరాలొస్తున్నాయి. కాని అతను కదలడు. ఒక ఉత్తరంలో తను పంపిన మనియార్డర్ తిప్పికొడుతున్నాననీ, డబ్బుతో మనుషుల్ని లొంగదీసుకోవాలన్న ప్రయత్నం చేయవద్దనీ, డబ్బుకు దేవుణ్ణమ్ముకునే పాపిని కాననీ, తమ్ము ఎవరూ వేరుచేయలేరనీ, ఏమేమో రాసింది సుశీలమ్మ.

తన్నిలా అపార్థం చేసుకున్నందుకు మొదట కోపంవచ్చింది గాని, ఆలోచించిన మీదట సుశీలమ్మ బాధ అర్థమైంది మేనకకు.

అయితే ఏమిటి చేయాలి? ఎలా ఈ పీటముడి విప్పడం?

తనెలాగూ వెళ్ళమని చెప్పలేదు గనక అతనే తన్ను అసహ్యించుకుని వెళ్ళిపోవాలి. అలా తను ప్రవర్తించాలి. అందుకుగాను మార్గమేమిటని ఆలోచించేసరికి ఒక ఉపాయం తట్టింది.

చంద్రశేఖరరావని ఓ కుర్రాడున్నాడు. చాలా మంచివాడు. మేనకను 'అక్కా అక్కా' అంటూ తిరుగుతుంటాడు. సినిమా వేషాల మీది మోజువల్ల బీయస్సీకి స్వస్తిచెప్పి మద్రాసు జేరాడు.

ఆ చంద్రశేఖరరావుని పిలిపించి, జరిగిన కధంతా చెప్పి, జరగవలసిన కధగూడా ఏమిటో వివరించింది మేనక. జరగవలసిన దాన్ని నటించడానికి చంద్రం భయపడ్డాడు.

'బ్రేవో మై బోయ్! యువారెనేక్టర్' అంటూ వీపుతట్టి, ఎవరి పాత్రలను వారు నటించడానికి ఉద్యమించారు.


* * *

ఊళ్ళో కలిసినప్పుడు మేనక నడిగాడు మోహన్ ఒకసారి – ఆ కుట్టుమిషను సాయిబు ఏమయ్యాడని. సాయిబెవ్వరంటే 'అదే నీప్రియుడు – నిన్ను లేపుకుపోయాడే వాడూ' అన్నాడు. 'ఓహో! ఇలాంటిదో కధ పుట్టించారన్నమాట నామీద!' అనుకున్న మేనక, ఎందుకైనా మంచిదని 'ఉన్నా'డన్నది. ఆపై ఇహ దానిమీద సంభాషణ జరగలేదప్పుడు.

అప్పుడు ఉన్నాడన్న సాయిబు, ఇప్పుడు మియాజాన్ రూపంలో, ఒకానొక గొప్ప ఫిల్మ్ ప్రొడ్యూసర్‌గా అవతారమెత్తి వచ్చాడు.

'హేదిపే అది? హెక్డా వుంది? లోన హింకోటి ప్రొడ్యూసర్ణి పెట్కోని కుల్కుతా హుందీ?' అంటూ తాగుబోతుమాటలు ప్రారంభించాడు మియాజాన్.

ఇంట్లో వున్నవాళ్ళంతా అతని ప్రవర్తనకు బెదిరిపోయి చూస్తూ బొమ్మల్లా నిలబడ్డారు. చూస్తే తురకవేషమైనా గొప్ప



దర్జాగల వేషం. ఆదర్జాముందు నోరువిప్పే ధైర్యం ఎవరికీ లేకపోయింది.

'నాది హుప్పుపుల్సా తిని నాకే హెసర్ పెడ్తాది? వారెవ్వా! ఈ రొమ్ముల్కి పాల్తాగి ఈ రొమ్ముకే గుద్దుతాది? అరే ఛీ! దీన్కంటే ఆ బజార్ కుక్కా నయం... మేన్క అంటా మేన్క! పెంటపోగుల్ మీన తిరిగేదాన్కి పట్కొచ్చి 'మేన్క' అని తోలుబెల్ట్ తగిలించింది మనం!'

'ఇంతకూ తమరెవరుస్వామీ?' అని అడక్కుండా ఉండలేకపోయాడు మోహన్.

తనఇంట్లో తననెవ్వరని ప్రశ్నించేసరికి కోపం మింటలేచింది మియాజాన్‌గారికి.

'హెవర్! నాది ఇంట్లో నాకీ హెవ్వరని సవాల్ జేస్తావ్? అసల్కి నువ్వు హెవడ్?' అంటూ మోహన్‌మీదికి దూకనే దూకాడు మియాజాన్.

మోహన్‌కి నోట మాటరాలేదు.

'ఈహిల్లూనాది; హింట్లోవుండేది మేన్కా నాది. ఇంకా మన పేరూ జెప్పమంటావ్? జనాబ్ మియాజాన్! ఖట్ ఖట్ మనే కుట్టూ మిషన్ కాణ్ణుంచి ఇట్టా కొట్టూకొచ్చినాం.'

కుట్టుమిష ననగానే అర్థమైపోయింది మోహన్‌కి. ఇక అడగవలసిందేమీలేదు.

కాని సాయిబుగారే నవ్వుతూ 'ఇధరావ్ భాయీజాన్' అని మోహన్ని దగ్గరకుపిలిచి 'తమ్ముడ్ తనవాడైనా ధర్మం సరింగా జెయ్యమన్నార్. నేజెప్తా ఇనోక్. మేన్కని

తెచ్చి, సిన్మాయిస్టార్‌ని జేసింది మనం ! ఇస్టార్‌ని జేసి. ఆ ప్రొడ్యూసర్ గాడ్కి పట్కొచ్చి ఇంటోపెట్టింది మనం ! ఆడ్కి ఇంటోపెట్టి, నోర్లో ఎల్కలమందు పోయమన్నది మనం ! పోయమన్నవాడ్కి రావాల్నా పైసా, పోసిన మేన్కకి పోవాల్నా ? నువ్వా జెప్పుబే మేమ్ ఇన్కుంటాం' అన్నాడు జనాబ్ మియాజాన్.

మోహన్ ఆశ్చర్యపోతూ 'మీరిద్దరూ కలిసి ఒక ప్రొడ్యూసర్ని చంపారా' అని అడిగాడు.

మియాజాన్ పెద్దగా నవ్వుతూ 'అరే బేవ్‌కూఫ్ ! ఎవణ్ణీ బిస్మిల్లా చెయ్యకపోతే పైసా ఏణ్ణుంచి వస్తది ? మనం ఫిల్మ్ ప్రొడ్యూసర్ ఎట్టా అయితాం ?' అని ఇంకా ఏమేమో అంటున్నాడు.

మోహన్ ఇక అక్కడ నిలవలేక పోయాడు. లోపలికి వెళ్ళి బట్టలవీ సర్దుకుంటున్నాడు తిరుగుప్రయాణానికి.

ఇక్కడ పరిస్థితి ఇలా వుండగా, అక్కడ ఊళ్లో జ్వరంతో మంచమెక్కిన సుశీలమ్మ మూసిన కన్ను తెరవకుండావుంది. 'దేవుడు ! నా దేవుడు' అని ఒకటే పలవరింతలు. దిక్కుతోచని మూగపిల్లవాడు, మేనక రాసిన ఉత్తరమ్ముక్క తీసుకుని-ఎలాగైనా నాన్నను పిలుచుకొచ్చి తల్లిని రక్షించుకోవాలని - పట్నానికి ప్రయాణమయ్యాడు.

ఈ రైల్లో ఇతనూ, ఆ రైల్లో అతనూ ఎదురెదురు బళ్లల్లో ప్రయాణం చేశారు.

ఇంటికొచ్చి చూసేసరికి కొడుకు కనిపించలేదు. భార్య స్పృహలేని స్థితిలో మంచంలోనే వుంది. ఎవరోవచ్చి చెప్పారు - కుర్రాడు మద్రాసు రైలెక్కి వెళ్ళిపోయాడని.

వెంటనే తిరుగుప్రయాణమయ్యాడు మోహన్. మోహన్ని కిటికీగుండా చూసిన మేనక-అతను గేటుదాటి వచ్చేలోపుగానే-గబగబా చంద్రానికి తులసి వేషం కట్టించింది. అంతదాకా ఏడుస్తూ తన బాధ వెళ్ళబోసుకుంటున్నదల్లా వెంటనే 'రాగుబోతులం కావాలి' పదమన్నది.



చంద్రం, మేనక వికవికలతో పకపకలతో ఒకరిమీద ఒకరు పడి తూగుతున్నారు.

'దేవుడట దేవుడు. ఇంటికంటే గుడి పదిలమని మన యింట్లో పీఠ మేద్దామనుకున్నాడు.'

నవ్వులు.

'మూగవాడికి మఠం కట్టించమని ఇక్కడికి తోలాడు. మనుషులను తినేవాళ్ళం - మన దగ్గరా నాటకాలు ?'

ఇక వినలేకపోయాడు మోహన్. పిచ్చెక్కిన వాడికిమల్లే ఆవేశంతో ఊగిపోతూ 'రాక్షసీ ! నా కొడుక్కి మఠం కట్టిస్తావా ?

చెప్పు. ఏడీ? నా కొడుకేడి? మాట్లాడవేం?' అంటూ మేనకని పట్టుకున్నాడు. మోహన్ని తప్పించడానికి చేసిన చంద్రశేఖరరావు యత్నం విఫలయత్నమైంది.

'హంతకీ! ఇంకెంతమందిని హత్య చేద్దామనుకుంటున్నావు? వంచకీ! చావు. నీ కిదే శిక్ష. కులటా! చావు' అంటూ ఎంత బలంగా నొక్కగలడో అంత బలంగానూ మేనక గొంతునులిమి క్రింద పడదోశాడు మోహన్.

కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మేనక, కాగితం కలం తెమ్మని సంజ్ఞ చేస్తుండగా, ఒక ప్రక్కనుంచి కారులో మూగ పిల్లవాడికి కొత్తబట్టలు తొడిగించుకుని వచ్చిన తాయారూ, మరో ప్రక్కనుంచి ఉరుకులు పరుగులతో ఊరినుంచి బయలుదేరివచ్చిన సుశీలమ్మా, ఉభయులూ మేనక ఇంటిగుమ్మంలోనే కలుసుకుని, తల్లీబిడ్డల నొకరినొకరు కౌగిలించుకుంటూ **లోపలి** కొచ్చారు.

రాగానే కనబడ్డ దృశ్యమిది.

'దేవుడా! మన యిద్దరికీ రాసిపెట్టి లేదు. నా చేయి తగిలి నీ కళ్ళజోడు పగిలిన ఆ తొలినాడే అనుకున్నాను. ఇది అశుభమనీ మన ప్రేమ ఫలించదనీ. ఏ జన్మలో ఎవరి ప్రణయంలో నిప్పులు పోశానో, ఈ జన్మలో నే ననుభవించాను. పాపిష్టిదాన్ని నన్ను ప్రేమించి నువ్వు— దేవుడిలాంటి మనిషివి నువ్వు — గుడ్డివాడివై పోయావు .. నన్ను నమ్ము దేవుడా! ఉత్తమురాలైన సుశీలమ్మ కాపురంలో చిచ్చు పెట్టలేను నేను. అందుకే ఒక తురకవాణ్ణి కట్టుకున్నట్లు...' ఇక ఆవేశం చాలించమన్నట్లు చంద్రశేఖరరావు వైపు తిరిగి సంజ్ఞచేసింది మేనక.

మీసాలూ, గడ్డాలూ ఊడబీకేశాడు చంద్రం.

'ఇతను నా తమ్ముడిలాంటివాడు. నే నెవరితోనూ లేచిరాలేదు; ఎలాంటి పాపకృత్యాలూ చేయలేదు...ఇదుగో నాకు నేనే చనిపోతున్నట్లూ, నాకు చెందిన యావదాస్తీ — నా వల్ల అన్యాయమైన నీ బిడ్డకు చెందుతున్నట్లూ, మరణ వాఙ్మూలం రాశాను......అయితే ఒక్కమాట. చంద్రం! దగ్గరకురా బాబూ. వీరికిష్టమైతే ఒక లక్షరూపాయలు నీకిస్తారు. ఎలాగూ ప్రొడ్యూసర్ వేషం వేశావుగదా! వీళ్ళచుట్టూ వాళ్ళచుట్టూ ఏం తిరుగుతావు గాని. నువ్వే ఓ పిక్చర్ ప్రొడ్యూస్ చేయి. మా ప్రణయకథంతా నీకు చెప్పానుగా. అదే నీ సినిమా కథ.'

ఇక మాట్లాడలేకపోయింది మేనక. మాట పడిపోయిన మరో ఐదునిమిషాల్లో ప్రాణం పోయింది.

గుడిలో గంటలు మ్రోగుతుంటే పక్షులు రెక్కలాడించుకుంటూ ఎగిరిపోతున్నాయి.

ఆ గుడివైపుకే — చెరో చేతితో తమ ఒక్కగానొక్క దైన బిడ్డను పట్టుకుని, భార్యాభర్తలిద్దరూ తరలిపోతున్నారు.

